ప్రజాశక్తి
గురువారం 26 జూన్, 2025
5
శ్రీకాకుళం

కిడ్నీ ఆస్పత్రి ఉద్యోగాల తాత్కాలిక జాబితా విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన నియామకాలకు 289 దరఖాస్తులు వచ్చాయని సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా రూపొందించినట్లు పేర్కొన్నారు. రిసెప్షన్ క్లర్క్, డయాలసిస్ టెక్నీషియన్, సి-ఆర్మ్, జనరల్ డ్యూటీ, సెక్యూరిటీ వంటి పోస్టులకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జాబితాపై అభ్యర్థులకు అభ్యంతరాలు ఉంటే ఈనెల 26 నుంచి 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు గ్రీవెన్స్ దరఖాస్తును ఆస్పత్రికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.srikakulam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బడి బస్సులు భద్రమేనా..?

బడులు ప్రారంభమయ్యాయి. ఎప్పట్లానే ఫిట్‌నెస్ లేని బస్సులు మళ్లీ రోడ్డెక్కుతున్నాయి. విద్యార్థుల నుంచి ముందుగానే బస్సు ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు... వారి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడంలో మాత్రం నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తున్నాయి. బస్సు సౌకర్యం కలదు అంటూ ప్రచారం చేసుకుంటున్న విద్యాసంస్థలు, వారి బస్సుల ఫిట్‌నెస్‌పై మాత్రం దృష్టిసారించడం లేదు. కండీషన్‌పై శ్రద్ధ చూపకుండా బస్సులను నడిపిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.

- జిల్లాలో స్కూల్ బస్సులు 602
- ఫిట్‌నెస్ కోసం ముందుకొచ్చినవి 551
- పర్మిట్ తిరస్కరించినవి 25

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో పలు ఇంజినీరింగ్ కళాశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు వారి విద్యార్థుల కోసం బస్సులు నడుపుతున్నాయి. జిల్లాలో విద్యార్థుల కోసం బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల బస్సులు 602 ఉన్నాయి. వీటిలో 551 బస్సులు ఫిట్‌నెస్ కోసం యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నాయి. రెండేళ్ల లోపు కొనుగోలు చేసిన బస్సులకు వచ్చే ఏడాదికి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మూడేళ్ల కాలం పూర్తి చేసుకున్న ప్రతి బస్సు ఫిట్‌నెస్ కోసం తప్పనిసరిగా రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాలలు ఈనెల 12వ తేదీ నుంచి తెరుకున్న నేపథ్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచే బస్సులను రవాణాశాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ పరీక్షల కోసం తీసుకురావాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ అధికారులు ఈ దరఖాస్తులను బట్టి ఒక్కో తేదీలో కొన్ని స్కూళ్ల నుంచి బస్సులను తనిఖీ కోసం తీసుకురావాలని చెప్తారు. వాటికి సంబంధిత అధికారులు ఫిట్‌నెస్ పరీక్షల అనంతరం రోడ్డుపై ప్రయాణించేందుకు అనుమతిస్తారు. అలా అనుమతి పొందిన బస్సులు 526 ఉన్నాయి. 25 బస్సుల ఫిట్‌నెస్‌ను అధికారులు తిరస్కరించారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేసినా ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంది. కాలం చెల్లినవిగా గుర్తిస్తే వాటికి అనుమతించరు. వాటి పర్మిట్‌ను రద్దు చేస్తారు. రవాణాశాఖ కళ్లు కప్పి అడ్డదారుల్లో స్కూల్ బస్సులను కొన్ని యాజమాన్యాలు నడుపుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో ఈరకమైన సమస్య ఉందని రవాణా శాఖ అధికారులే చెప్తున్నారు. అటువంటి బస్సులు పట్టుబడితే సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు, భారీగా అపరాధరుసుము విధిస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పలు విద్యాసంస్థలు నడుపుతున్న బస్సులపై రవాణాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పుడైనా, ఏదేని ప్రాంతంలో బడి బస్సులు ప్రమాదానికి గురైతే తప్ప రంగంలోకి దిగడం లేదన్న ఆరోపణలూ లేకపోలేదు.

నిబంధనలు గాలికొదిలేస్తున్న వైనం

విద్య ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేస్తున్నాయి. విద్యార్థులను ఆకర్షించేందుకు బస్సు సౌకర్యం అంశాన్ని పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నాయి. బస్సులు నడపడంలోనూ విపరీతంగా పోటీ పడుతున్నాయి. బస్సులు నడుపుతున్న విద్యాసంస్థలు, విద్యార్థుల భద్రత అంశాన్ని మాత్రం గాలికొదిలేస్తున్నాయి. తక్కువ జీతానికి వస్తున్నారని అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తున్నారు. కొన్నిసార్లు అనుభవం ఉన్నా వ్యసనాలున్న వ్యక్తులను డ్రైవర్లుగా నియమించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బస్సుల్లో కనీసం ప్రథమ చికిత్స పెట్టెలనూ ఏర్పాటు చేయడం లేదు. పాఠశాల బస్సుల నమూనాను చాలా యాజమాన్యాలు అనుసరించడం లేదు. బస్సు నడిపే డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల డ్రైవింగ్ అనుభవం ఉండాలి. 60 ఏళ్ల లోపు వయసు, ఆరోగ్యంగా ఉండాలి. బస్సు సామర్థ్యాన్ని బట్టి 30 నుంచి 50 మంది వరకు విద్యార్థులను ఎక్కించాల్సి ఉన్నా, పరిమితికి మించి ఎక్కిస్తున్నారు. చిన్న పిల్లలు ప్రయాణిస్తున్న బస్సులో ఆయా సైతం ఉండాలి. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కచ్చితంగా ఉండాలి. చాలా బస్సుల్లో బాక్స్ ఉంటున్నా, అందులో మందులు మాత్రం ఉండవు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా రోడ్డెక్కి బస్సులు తిరుగుతున్నా, ఆర్‌టిఎ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బడి బస్సుల భద్రతపై దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

విద్యాసంస్థలు ఫిట్‌నెస్ చేయించని బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేస్తాం. అటువంటి బస్సులను నడిపే డ్రైవర్ల లైసెన్స్‌ను రద్దు చేస్తాం. బడి బస్సుల నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నాం. ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాకే తిరిగేందుకు పర్మిట్ మంజూరు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- ఎ.విజయసారథి
డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

రాత్రి విధులు రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విఆర్‌ఎలకు రాత్రి విధులను రద్దు చేయాలని విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు సత్యనారాయణ డిమాండ్ చేశారు. నైట్ డ్యూటీల రద్దు, పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యాన విఆర్‌ఎలు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని చెప్పారు. దళిత, నిమ్న కులాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 19,500 మంది విఆర్‌ఎలు ఉన్నారని, వారి సమస్యలు పరిష్కరించకుండా మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేసి మంచి ప్రభుత్వంగా మన్ననలు పొందాలని హితవు పలికారు. విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి మాట్లాడుతూ పార్ట్ టైమ్ పేరుతో ఫుల్ టైమ్ సేవలను ప్రభుత్వం ఉపయోగించుకున్నా, విఆర్‌ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా నామినీలుగా పనిచేస్తున్న వారి సేవలను వినియోగించుకుంటున్నా విఆర్‌ఎలుగా గుర్తించకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. వీరిని వెంటనే విఆర్‌ఎలుగా గుర్తించాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. విఆర్‌ఒ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్ తదితర ఖాళీల్లో ప్రమోషన్లు 70 శాతం విఆర్‌ఎలకే కేటాయించాలని, చట్టవిరుద్ధంగా చేయిస్తున్న నైట్ డ్యూటీలను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.అప్పారావు, బి.రాములమ్మ, ఎన్.సీతప్పడు, జి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిజి సెట్‌లో మెరిసిన హారిక

రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం

ప్రజాశక్తి - టెక్కలి

హారిక

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఒడిశా రాష్ట్రం రామసాగరానికి చెందిన తీయల హారిక బుధవారం విడుదలైన పిజి సెట్ ఫలితాల్లో సత్తా చాటింది. ఎస్.వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పి.జి సెట్ ఫలితాల్లో హారిక 96 మార్కులు సాధించి బోటనీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. హారిక తండ్రి ధనుంజయరావు పర్లాకిమిడిలో పిఆర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి శాంతి గృహిణి. హారిక ప్రథమ స్థానం సాధించడంపై టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, బోటనీ విభాగం అధ్యాపకులు వాసుబాబు అభినందించారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని హారిక తెలిపారు.

కిడ్నీ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ

ఆస్పత్రిలోని పరికరాలను పరిశీలిస్తున్న అజశర్మ

ప్రజాశక్తి - పలాస

పలాస కిడ్నీ ఆస్పత్రిలో వైద్యులు, పూర్తిస్థాయి సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ పరిశోధనా కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రతను దష్టిలో ఉంచుకొని పలాసలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ కేంద్రంలో వైద్య సేవలు ప్రారంభించినా, పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. 102, 87 జిఒల ఆధారంగా 60 మంది వైద్యుల పోస్టులను నియమిస్తామని చెప్పి 20 మందిని మాత్రమే నియమించారని, రోగులకు ఎలా సేవలందుతాయని ప్రశ్నించారు. 60 మంది నర్సులకు గానూ 58 మంది కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని, శాశ్వత నర్సులను ఎందుకు నియమించడం లేదో ప్రభుత్వం చెప్పాలన్నారు. 18 మంది టెక్నీషియన్లకు పది మంది మాత్రమే ఉన్నారని, వారూ కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నారని చెప్పారు. నెఫ్రో ప్లస్ అనే ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాలసిస్ కేంద్రంలో నెఫ్రాలజిస్టు పూర్తిస్థాయిలో అందుబాటులో లేరన్నారు. 200 పడకల ఆస్పత్రి అని చెప్పినా వంద పడకలూ లేవన్నారు. రోజురోజుకూ కిడ్నీ రోగులు, మరణాల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డు నుంచి ఆస్పత్రికి రోగులు వచ్చి వెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు ధర్మారావు, అజయ్ కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు నాయకులు గణపతి, దిలీప్ కుమార్ తదితరులున్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇరాన్‌పై దాడితో క్రూడాయిల్ సంక్షోభం వస్తుందని, దేశ ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు. భారత్ అవలంభిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమన్నారు. ఇరాన్‌పై దాడులు అమెరికా స్వప్రయోజనాల కోసమేనని, దీనికి ప్రపంచ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన అవసరం లేదన్నారు. భారత్‌తో ఇరాన్ ఎప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ప్రతి కష్ట సమయంలోనూ మద్దతు ఇస్తోందని తెలిపారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెప్తోందని విమర్శించారు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తోందని తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయని చెప్పారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై ఇరాన్ సైతం సంతకం చేసిందన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిందని, ఈ దాడులకు అమెరికా కూడా ఇజ్రాయిల్‌తో చేతులు కలిపిందని దుయ్యబట్టారు. దౌత్య చర్చలకు రెండు వారాల సమయం ఇస్తున్నానని ప్రకటించిన అమెరికా, రెండు రోజుల్లోనే దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టమవుతోందన్నారు. ఈ దాడి ప్రపంచ శాంతిపై, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. చమురు దిగుమతులు, వలస కార్మికులకు అవకాశాల కోసం పశ్చిమాసియాపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోందని, అభివద్ధి చెందుతోన్న దేశాలపై ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్.ప్రకాశరావు, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, ఎం.ఆది నారాయణమూర్తి, టి.తిరుపతిరావు, ఎ.లక్ష్మి, బి.సంతోష్, ఆర్.అరవింద్, ఎ.సోమశేఖర్, పి.జగ్గారావు, పి.జనార్థనరావు, ఎన్.సంతోష్, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

విద్యుత్ పొదుపు భావితరాలకు అవసరం

ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

విద్యుత్ పొదుపు భావితరాలకు అవసరమని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షణ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సూర్యగర్ పథకం బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతేడాది ఫిబ్రవరి 15న దేశంలో గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ భారం నుంచి కొంతవరకు ఉపశమనం పొందడానికి పిఎం సూర్యగర్ పథకం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. ప్రతిగృహానికీ పై కప్పులపై సౌర పలకాలను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ అందిస్తామని తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని అన్నారు. ఆసక్తి ఉన్న వారు సురేష్ కుమార్ ఫోన్ నంబరును 94408 12387 సంప్రదించాలని చెప్పారు. జిల్లాలో ఇంతవరకు సూర్యఘర్ పథకం కింద 1599 కనెక్షన్స్ పెట్టామని అన్నారు. వీటి అమలుకు జిల్లాలో 22 ఏజెన్సీలు ఉన్నాయని చెప్పారు. వ్యవసాయ, గృహ ఉత్పాదకతను పెంచేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.లక్ష్మి, గుడ్ల జగ్గారావు, ఆంకడాల తవిటన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా

ప్రజాశక్తి - కవిటి

పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, పంచాయతీ కార్యదర్శులు దీనిపై పూర్తిస్థాయిలో నిమగ్నమై కార్యక్రమాలు నిర్వహించాలని జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా అన్నారు. ఐవిఆర్ఎస్ పారిశుధ్య నిర్వహణ సమాచార సేకరణలో భాగంగా మండలంలోని బొరివంక, ఇద్దివానిపాలెం గ్రామాలను బుధవారం సందర్శించిన ఆయన పారిశుధ్య పనులు పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజూ చెత్త సేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణపై ఇంటింటికీ తిరిగి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం బొరివంక సచివాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమై ఇద్దివానిపాలెంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని, తక్షణమే ఇద్దరు పారిశుధ్య కార్మికులను నియమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని కోరారు. చాలా గ్రామాల్లో అవగాహన లేక పారిశుధ్య నిర్వహణ కష్టమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డి, ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్‌ఖాన్, ఇఒ వీరభద్రస్వామి, ఎంపిటిసి దుద్ది సతీష్, మాజీ ఎంపిటిసి బెందాళం విజయకృష్ణ, బల్లెడ జయప్రకాష్, బల్లెడ శ్రీపతి, బల్లెడ మోహనరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు గుణవతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షులపై కాంగ్రెస్ నాయకుల ఛార్జిషీట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణారావుపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఛార్జిషీట్ ప్రకటించారు. ఆయన పనితీరు పార్టీ వినాశనానికి కారణమవుతోందని, పార్టీ అభివృద్ధికి కషి చేయాల్సిన డిసిసి అధ్యక్షులు జిల్లాలో పార్టీ సీనియర్ నాయకులను పక్కన పెట్టి తన ఇష్టానుసారం ప్రవర్తించడం తగదని తీర్మానం చేశారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానాలను ఆమోదించి పార్టీ అధిష్టానానికి పంపించేందుకు నిర్ణయించారు. ఇటీవల పిసిసి అధ్యక్షులు షర్మిల పర్యటన గురించి తమకు ముందుగా తెలియజేయలేదని, కనీసం ఏ ఒక్క సీనియర్ నాయకునికీ సమాచారం ఇవ్వలేదన్నారు. డిసిసి అధ్యక్షుని పనితీరుని వ్యతిరేకిస్తూ ఆయనపై ఫిర్యాదు చేయడం పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంగా అధిష్టానాన్ని వ్యతిరేకించేదిగా చిత్రీకరించడం, ఆ విధంగా నాయకత్వానికి తెలియజేయడం సరికాదని తీర్మానించారు. కృష్ణారావు పనితీరుపై పిసిసి దర్యాప్తుకు ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామంగా పేర్కొన్నారు. ఆర్థిక కార్యక్రమాలను పర్య వేక్షించేందుకు ఇందిరా విజ్ఞాన్ భవన్ ట్రస్ట్ పేరుతో ట్రస్ట్ ఉండగా, డిసిసి అధ్యక్షులు ట్రస్ట్‌ను ఖాతరు చేయకుండా ట్రస్టు సభ్యులకు ఏమాత్రం చెప్పకుండా రూ.20 లక్షల వరకు ఆర్థిక అరాచకానికి పాల్పడడంపై విచారణను పారదర్శకంగా కొనసాగించాలని తీర్మానంలో పేర్కొన్నారు.

తాము కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇచ్చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో డిసిసి మాజీ అధ్యక్షులు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ పరమేశ్వరరావు, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, పాతపట్నం, ఎచ్చెర్ల ఇన్‌ఛార్జీలు మజ్జి మురళీమోహన్, కరిమజ్జి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం సిటీ : నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్‌లో 25 రిలేషన్‌షిప్ మేనేజర్ల పోస్టులకు 25 నుంచి 35 మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత గల ఈ ఉద్యోగాలకు పురుషులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. నెలకు జీతం రూ.16,500, ఇన్సెంటివ్ ఉంటుందని, అభ్యర్థులకు ద్విచక్ర వాహన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు శ్రీకాకుళం, పలాస, సోంపేట, టెక్కలి, రాజాం, పాతపట్నం, పాలకొండ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువకులు తమ విద్యార్హతలు, ఉద్యోగ అనుభవ వివరాలను WWW.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని హాజరు కావాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డుతో ఈనెల 27న హాజరు కావాలని పేర్కొన్నారు.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.No:7/2025 in OS. No:185/2017

Between:-
గెంబలి ప్రభాకర రావు ....DHR-Plaintiff
And:
కలివరపు వెంకటరమణ సుబుద్ధి గుప్త ......JDR-Defendent

To,
శ్రీ కలివరపు వెంకటరమణ సుబుద్ధి గుప్త, S/o లేటు కమలనాభం, ఉణ్ణవారి వీధి, నరసన్నపేట పోస్టు, టౌన్ మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు

పై నెంబరు గల పిటిషను కోర్టు వారు యిచ్చిన డిగ్రీని అమలు చేయుటకుగాను, డిగ్రీ హోల్డర్- వాది మీ పై వేసిన పిటిషను మీ యొక్క హాజరు నిమిత్తం తే **04-07-2025 దీన వాయిదా వున్నది.** కావున మీరు వాయిదా రోజున, మీరు వ్యక్తిగతంగా గాని, లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి మీకు గల ఆక్షేపణలు మహారాజశ్రీ కోర్టు వారి ముందు తెలియ పరుచుకోవలెను. లేని ఎడల మీకు వ్యతిరేకంగా (Exparty) తీర్పు చెప్పబడునని యిందు మూలముగా తెలుసుకోవలయును.

(మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్యులు ప్రకారం)

ధర్మాన. నీలన్నాయుడు
న్యాయవాది,
శ్రీకాకుళం,
ఫోన్:9441439673.

శ్రీకాకుళం
26-6-2025

నిబంధనలు తొలగించాలి



పలాస : సమ్మె నోటీసు అందజేస్తున్న సర్వేయర్లు

ప్రజాశక్తి - లావేరు

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సొంత మండలం నిబంధన తొలగించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ముందు మండలంలోని 33 గ్రామ సచివాలయాల ఉద్యోగులు నిరసన చేపట్టారు. టెంట్లు వేసి సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగులు నిరసన చేపట్టారు. పలు డిమాండ్లతో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల సంఘం మండల అధ్యక్షుడు బలివాడ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు తలాడ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం హేతుబద్ధీకరణలో మిగులు ఉద్యోగులను ఏం చేస్తారన్న దానిపై పూర్తి స్పష్టత వచ్చే వరకు హేతుబద్ధీకరణ వాయిదా వేయాలని, బదిలీల విషయంలో సొంత మండలం అనే నిబంధన వెంటనే తొలగించి, గ్రామాన్ని ప్రతిపాదికగా తీసుకోవాలని, బదిలీలు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా మెరిట్ లిస్ట్ ప్రాప్తికి జరగాలని, 9 నెలలు ఆలస్యంగా జరిగిన ప్రొబేషన్ కాలానికి తక్షణమే నోషనల్ ఇంక్రిమెంట్లు విడుదల చేయాలన్నారు. ఒకే సమయంలో వివిధ డిపార్ట్మెంట్లు పని చెప్పి సచివాలయ ఉద్యోగులను మానసికంగా ఒత్తిడికి గురి చేయకుండా డిపార్ట్మెంట్ల సమన్వయంతో ఒకే సమయంలో ఒకే పని నిబంధన పాటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ పి.వెంకటరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి నివేదిక పంపిస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ జెఎవెల్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెజర్ గోరేశంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సొంత మండలంలో బదిలీలు చేపట్టాలి

పలాస: సచివాలయంలో పనిచేస్తున్న తమకు సొంత మండలంలో బదిలీలు చేపట్టాలని సచివాలయం సర్వేయర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంత కుమార్, మండల సర్వేయర్ గిరి, మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సునందకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు చేయనున్న సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా సమాచారం ఇచ్చి రేషనలైజేషన్ చేయాలన్నారు. ఉద్యోగోన్నతులు కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. టిఎ, డిఎ ఇవ్వాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం వద్ద చేయనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కె.శేశరావు, ఎం. వెంకటేశ్వర రావు, కొరాడ రమేష్, కె.సోనియా, బి.అఖిల్ పాల్గొన్నారు.

లావేరు : ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మెళియాపుట్టి: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండాలకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం ఆయా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో దుక్క శరత్ కుమార్‌రెడ్డి, బమ్మిడి కిరణ్‌కుమార్, దమయంతి, రాజారావు, సుజాత, మోహనకృష్ణ, ప్రణీత్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమాల మాస్టర్ ఓంకార్

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

పలాస: ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ అనేక ప్రజా సంఘాలు నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి బత్తిన ఓంకార్ మాస్టర్ అని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. మండలంలోని మాకన్నపల్లిలో సూర్యోదయ యువజన సంఘం, కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన ఓంకార్ మాస్టర్ ప్రథమ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన సమాధిని సరస్వతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎపి జెడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాలలో కాకుండా ఉద్దాన ప్రాంతంలో పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధి సమస్య, జీడి గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగం తరపున పోరాటం చేశారని గుర్తుచేశారు. ఉద్దాన ప్రాంతంలో విద్యార్థులు, యువత విద్యకు దూరమవుతున్నారని భావించి ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక ఏర్పాటు చేస్తూ గ్రంథాలయం నిర్మాణానికి కృషి చేశారన్నారు. గ్రీన్‌ఆర్మీ కార్యకలాపాల్లో భాగంగా మొక్కలు పంపిణీ చేయడం, వాటిని నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారన్నారు. ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థి సమస్యలపై పోరాటం చేశారన్నారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ... యుటిఎఫ్‌లో అనేక పదవులు చేపట్టి సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. యుటిఎఫ్ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సర్పంచ్ సైని దేశయ్య, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గేదెల దిలీప్ కుమార్, గార ఉదయ్ కిరణ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బంధ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరాన రమేష్, బిద్ది కూర్మారావు, కుత్తు ప్రకాశరావు, బొమ్మాళి శివ కుమార్, పోతనపల్లి గీతమ్మ, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లిలో నిర్వహించిన ఓంకార్ వర్ధంతి వేడుకల్లో సిపిఎం బి.ఆనందరావు, బి.రామకృష్ణ, ఎన్.మోహనరావు, బి.సుగుణవతి, ఎన్.ఈశ్వరమ్మ, బి.లక్ష్మి, ఎస్.సరోజనమ్మ, ఎస్.పారమ్మ, పి.గున్నమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

పలాస : చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అజశర్మ

సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారాను అరికట్టేందుకు చర్యలు

సోంపేట: సోంపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నాటుసారా పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ వి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. సోంపేట, మందస మండలాల్లో నిర్వహించిన దాడుల్లో ముగ్గురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 55 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని తెలిపారు. మందస మండలం గుడ్డికోలలో మహిళ నుంచి 40 లీటర్లు పట్టుకొని, నాటుసారా తయారీకి వినియోగిస్తున్న 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. సోంపేట మండలంలో బాతుపురం రమేష్ నాయక్ నుంచి వంద నాటుసారా ప్యాకెట్లు, రాజాంలో ఢిల్లమ్మ నుంచి 50 నాటుసారా ప్యాకెట్లతో పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురిని సోంపేట కోర్టులో హాజరుపర్చగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నాటుసారా అమ్మకాలపై ఏదైనా సమాచారం ఉంటే 9440902358 నంబరుకు తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో సోంపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ సుజాత, సిబ్బంది భానుప్రసాద్, మార్కారావు, విజయ్, గాలిబ్, రమణ, వెంకటేష్, ఉమాపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

జెమ్స్‌లో విజయవంతంగా రోబోటిక్ శస్త్రచికిత్సలు

శ్రీకాకుళం రూరల్: జెమ్స్ ఆస్పత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలతో రోబోటిక్ శస్త్ర చికిత్సలు పూర్తి చేశామని, రోగి సంరక్షణ, అధునాతన శస్త్ర చికిత్స సాంకేతికతకు ఒక నూతన దశన సూచిస్తుందని ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ వసుంధర చీపురుపల్లి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోబోటిక్ అసిస్టెంట్ సర్జరీ సిస్టమ్‌ను ఉపయోగించి 46 ఏళ్ల మహిళలకు విజయవంతంగా సర్జరీ చేసి గర్భాశయాన్ని తొలగించామన్నారు. రోబోటిక్ శస్త్ర చికిత్సలు పూర్తి చేయడం జెమ్స్ ఆస్పత్రి బృందానికి మైలురాయి అన్నారు. రోబోటిక్ సహాయంతో చేసే శస్త్ర చికిత్సలు కచ్చితంగా సురక్షితంగా ఉంటాయన్నారు. రోగులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. రోబోటిక్ శస్త్ర చికిత్సలకు కేంద్రంగా జెమ్స్ నిలుస్తుందని సిఇఒ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ లలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, హెచ్ఒడి డా రేవతి, గైనకాలజిస్ట్ డా స్నేహ, డా శిరీష, జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్, జ్యోత్స్నా తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న రామకృష్ణనాయుడు తదితరులు

మహిళలు ముందంజలో ఉండాలి

బూర్జ: బూర్జ మండల మహిళా సమాఖ్య సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని విధాలుగా ముందంజలో ఉండాలని, ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా కుటుంబాన్ని మహిళలతో నడిపించే విధంగా ప్రణాళిక రూపొంది స్తుందన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలకు కుట్టుమిషన్లు ఎంబ్రాయిడింగ్ డిజైన్స్ వంటి వృత్తి విద్యా కోర్సును అందించి ట్రెయినింగ్ కాలం పూర్తి చేసిన తర్వాత వాళ్లకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తుందని, తద్వారా మహిళలకు రుణాలిచ్చి ఆదుకునేందుకు చర్యలు చేపడుతుం దన్నారు. కార్యక్రమంలో ఎపిఎం బాబూరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఇందుమతి, గంగు రామ చంద్రరావు, స్త్రీనిధి మేనేజర్ ఉదయకిరణ్, అప్పలపేట సర్పంచ్ కొరికాన వెంకటి, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్

రణస్థలం రూరల్: పెన్షనర్స్ అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు రణస్థలం సబ్ ట్రెజరీలో రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన సుమారు 450 మంది పెన్షనర్స్ ఉన్నామని, అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైందని, అధ్యక్షులుగా పిన్నింటి సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా మాడుగుల రామారావు, ఉపాధ్యక్షులుగా బాలి రామునాయుడు, సహా కార్యదర్శిగా మన్నె కృష్ణానందం తదితరులు ఎన్నుకోబడినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ కొరకు ఎమ్మెల్యేకు వారు విజ్ఞప్తి చేయగా ప్రభుత్వం తరుపున మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గత 42 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తమ సంపూర్ణ మద్దతును బుధవారం తెలియజేశారు. కార్మికుల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి మద్దతు ప్రకటించారు. మద్దతు తెలియజేసిన వారిలో నాయకులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, సనపల అన్నాజీరావు, రెల్ల సురేష్ తదితరులున్నారు.

పుస్తకాలు అందిస్తున్న నాయకులు

పుస్తకాల పంపిణీ

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎస్.పినారాయణస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు మాట్లాడుతూ రేపటి తరానికి ప్రాథమిక స్థాయిలో పునాది వేయాలని, దానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ, బాసుదేవ్ ప్రదాన్, బార్ల జగన్నాథం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సన్నద్ధం

లావేరు: మండలంలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.29.59 కోట్లుతో చేపట్టిన పనులకు 18వ విడత సామాజిక తనిఖీలకు సామాజిక తనిఖీ బృందాలు సన్నద్ధం అవుతున్నాయని ఎస్ఆర్‌పి బండారు సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ మేరకు రికార్డులను తయారు చేస్తున్నామన్నారు. పిఆర్, గ్రామీణ నీటి సరఫరా, ఫారెస్ట్, ఎన్ఆర్ఇజిఎస్, సమగ్ర శిక్ష శాఖలకు సంబంధించి చేపట్టిన పనులను గ్రామాల్లో పరిశీలించి తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు.

జగన్‌ను కలిసిన చింతాడ

జగన్‌తో రవికుమార్

ఆమదాలవలస: మాజీ సిఎం వైఎస్ జగన్‌ను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం తాడేపల్లి లోని వైసిపి కేంద్ర కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు రవికుమార్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రవికుమార్‌ను జగన్ అభినందించినట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి, పార్టీ విజయానికి నిరంతరం శ్రమించాలని జగన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.

ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

హిరమండలం: ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని మర్రిపాడులో నియోజకవర్గ గిరిజన సంక్షేమ, అభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరును గిరిజనులకు బుధవారం వివరించారు. ఐటిడిఎ స్పెషల ఆఫీసర్, మండల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో పయనించాలి

టెక్కలి : విద్యార్థులు తమ చదువులను వినియోగించుకుని అభివృద్ధి బాటలో పయనించాలని ఐతమ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.జయంతిరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీతంపేట డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎం.రవికిరణ్, బి.సతీష్‌కుమార్, లూక్‌పాల్, కవిత, హేమరాజ్, శాంతనకుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్లు పాల్గొంటారని తెలియజేస్తూ ఎపి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, పాఠశాల, కళాశాలల స్వీపర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేశ్వర పట్నాయక్‌కు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఉత్తర, కె.సుశీల, నగర కార్యదర్శి టి.ప్రవీణ బుధవారం విద్యాశాఖ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా కేంద్ర ప్రభుత్వం మార్చి వేసిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా గుర్తించి, కనీసవేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెనూచార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, 10 నెలలకు వేతనాలు చెల్లిస్తున్నారని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌కు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, వేసవి సెలవుల్లో పనిచేసినందుకు సగం వేతనం కాకుండా పూర్తి వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.ఈశ్వరమ్మ, ఎ.మాలతి, చాందిని, ఎ.సుధారాణి తదితరులున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న ఆరేలమ్మ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సింహ, మహిళా కార్యదర్శి పుక్కేలా అరేలమ్మ కోరారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ బోర్డు తిప్పి 11 ఏళ్లు అవుతుందని అన్నారు. ఈ కాలంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాల నాగేశ్వరావు నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దీని ఫలితంగా గత ప్రభుత్వం రూ.పది, రూ.20 వేలు లోపు ఉన్న వారికి, మృతి చెందిన బాధితులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పించారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్ల ప్రసాద్, పి.అర్జున్, విద్యాధరి బెహరా, నారాయణ బాదిత్య, రోజా పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే బిఆర్ఎయు అభివృద్ధి

మాట్లాడుతున్న బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ రజని

ఎచ్చెర్ల: అందరి కృషి, అంకితభావమైన సేవల ద్వారానే డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎన్నో విజయ శిఖరాలను అందుకుందని వక్తలు అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో డా. బిఆర్ఎయు అభివృద్ధికి వర్సిటీ వర్గాలతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం మరింత అండగా నిలవాలని కోరారు. వర్సిటీ 18వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ గ్రామీణ వెనుకబడిన ప్రాంతంలో స్థాపించిన డా.బిఆర్ఎయు ప్రగతి, పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం అయ్యేలా సంకల్పించుకోవాలన్నారు. వర్సిటీ ప్రతిష్టను, విద్యా వ్యవస్థను దిగజార్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాకారంతో ఇటీవల విడుదలైన పిఎం ఉషా నిధులను అన్ని విధాలా వర్సిటీ బలోపేతానికి, మౌలిక వసతులు పెంచేందుకు, నూతన నిర్మాణాలకు వెచ్చించనున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయడు మార్గదర్శకంలో స్వర్ణాంధ్ర సాధనలో బిఆర్ఎయు చైతన్యవంతమైన పాత్ర పోషించనుందన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, కార్యక్రమ కన్వీనర్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. ఎ.ఉదయ్ భాస్కర్, డా.ఎం.అనురాధ, డా. సిహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.డి. వనజ, డా. కె.ఉదయ్ కిరణ్ ఎస్ఒ డా. కె.సామ్రాజ్య లక్ష్మీ, అధ్యాపక, బోధనేతర సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా క్యాంపస్‌లోని గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

గ్రామస్తులకు పట్టుబడిన జింక

అటవీ ప్రాంతంలో వదిలిన అటవీ సిబ్బంది

జింకను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

సరుబుజ్జిలి: సీతంపేట, బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో ఉన్న రిజర్వ్ అటవీ ప్రాంతం అంతరించిపోతున్న దృష్ట్యా సరైన అనుకూల ప్రాంతం లేకపోవడంతో అడవి జంతువులు మైదాన ప్రాంతానికి పరుగులు తీస్తున్నాయి. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజల దృష్టిలో ఈ జంతువులు కంటబడి కనుమరుగవుతున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో అడవి జంతువులు చొరబడితే గ్రామస్తులు పట్టుకొని వన్యప్రాణ చట్ట నిబంధనలను తలుచుకొని కొంతమంది వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందిస్తున్నారు. బుధవారం సరుబుజ్జిలి మండలం మర్రిపాడు గ్రామంలో సుమారు 70 నుంచి 80 కేజీల బరువు ఉన్న జింక ఓ వ్యక్తి కంట పడింది. ఆ వ్యక్తి ఆ జింకను వెంబడించగా అది సవలాపురం జంక్షన్ సమీపంలో ఉన్న బురిడీవలస కాలనీలో ప్రవేశించి ఓ ఇంటిలో చొరబడింది. వెంటనే గ్రామస్తులు దానిని బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సరుబుజ్జిలి సెక్షన్ అటవీశాఖ అధికారి సాయిరాం ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది భాష, జై రావు, వెంకట్రావు, నారాయణరావు, శరత్ ఆ గ్రామానికి చేరుకొని గ్రామస్తుల నుంచి జింకను స్వాధీనం చేసుకొన్నారు. జింకకు ఎటువంటి గాయాలు లేకపోవడంతో అటవీశాఖకు చెందిన వాహనంలో సిబ్బంది సీతంపేట మండలం ఓండ్రుజోల గ్రామ సమీపంలో ఉన్న రిజర్వ్ అటవీ ప్రాంతంలో వన సంరక్షణసమితి అధ్యక్షులు అప్పారావు ఆధ్వర్యంలో అడవిలో విడిచిపెట్టారు. అనంతరం సరుబుజ్జిలి మండల కేంద్రంలో అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ మూగ జీవాలైన వన్యప్రాణులను ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో ఆదరించాలన్నారు.

పిల్లల ప్రియతమ మాస్టారు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆయన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. 31 ఏళ్ళు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అంకిత భావంతో పనిచేశారు. ఎక్కడ పనిచేసినా అక్కడ ప్రజలతో, విద్యార్థులతో మమేకమై పనిచేస్తుంటారు ఆయనే భోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి). ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. తన తాతగారు బగ్గాం రాజారావు, తండ్రి రామారావు ఉపాధ్యాయులు కావడంతో వారిని ఆదర్శంగా తీసుకొని ఆయన కూడా పనిచేసిన పాఠశాలల్లో పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి పాటుపడ్డారు. డిగ్రీ చదువుతున్నప్పుడే ఇప్పటి పార్వతీపురం మన్యం జిల్లా గుమలక్ష్మీపురంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 1 నుంచి 7వరకు పాఠశాల ప్రిన్సిపాల్‌గా చేరారు. బిఇడి చేసి ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ఉమామహేశ్వరరావు 8-2-1964 రామారావు, హేమలతలకు జన్మించారు. 1 నుంచి పదో తరగతి వరకు గుమ్మలక్ష్మీపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది బొబ్బిలి ఆర్.ఎస్.ఆర్.కె.రంగారావు కాలేజీ, ద్వితీయ సంవత్సరం జూనియర్ కళాశాలలో చదివారు. డిగ్రీ (బి.ఎ ఎకనామిక్స్ మెయిన్) విజయనగరం మహారాజా కళాశాలలో పూర్తిచేసి, ఎంఎ పొలిటికల్ సైన్స్ ఆంధ్రా యూనివర్సిటీలో చదివారు. బిఇడి ఇంగ్లీషు, సోషల్ సబ్జెక్టుగా చదివి విశాఖ జిల్లా పాడేరు మండలం కిండంగి ప్రాథమిక పాఠశాలలో 1-7-94లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఆ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. నాలుగేళ్ల మండల రిసోర్స్‌పర్సన్‌గా మలకపాలెం కాంప్లెక్స్‌కు పనిచేశారు. అలాగే డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. 2001లో అంతర్ జిల్లా బదిలీల్లో శ్రీకాకుళం జిల్లా కమ్మసిగడం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదేళ్ళు ఉపాధ్యాయునిగా పనిచేసి, అనంతరం 2009లో ఎచ్చెర్ల మండలం కొత్త కూర్మినాయుడుపేట బదిలీపై వెళ్లారు. ఆ పాఠశాలకు కావాల్సిన సదుపాయాలు ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేశారు. 2017లో గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా బదిలీపై వెళ్లి ఆ పాఠశాలలో నాడు-నేడు నిధులు రాకపోయినా ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ నిధులు, స్థానికుల నిధులు, తన సొంతనిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలు సమకూర్చారు.

అవార్డులు

2007లో విశాఖ కళాపరిషత్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ అవార్డు, 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి జిల్లా కలెక్టర్ లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో తీసుకున్నారు. 2017లో తిరుపతి శ్రీవెంకటేశ్వర సన్నిధిలో చదలవాడ కృష్ణమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా పురస్కారం అందుకున్నారు. 2025 మేనెలలో ఢిల్లీలో చిన్నారావు వెల్ఫేర్ ట్రస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇండియా జిఎస్‌టి కమిషనర్ రెహమాన్ చేతులమీదుగా అందుకున్నారు. శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

1993లో అగ్రికల్చర్ ఆఫీసర్ బుడుమూరు విరాట్ పట్నాయక్, ధనలక్ష్మి కుమార్తె స్వాతితో వివాహమైంది. కుమారులు భోగెల వినయ్ సాయి, కోడలు జయచంద్రిక సాఫ్ట్‌వేర్ హైదరాబాద్), డాక్టర్ భోగెల ప్రవీణ్ సాయి, బిహెచ్ఎంఎస్, ఎండి డాక్టర్ కావ్య బిహెచ్ఎంఎస్.

తర్లికోట వద్ద రోడ్డు ప్రమాదం

భార్య మృతి, భర్తకు గాయాలు

రత్నాలమ్మ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారి తర్లిపేట కూడలి వద్ద బుధవారం వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో బుడత రత్నాలమ్మ (36) మృతి చెందగా, అమె భర్త లోకనాథం తీవ్రగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... భార్యాభర్తలు రత్నాలమ్మ, లోకనాథం కలిసి ట్రాలీరిక్షాపై వారు పండించిన సారికంద శ్రీపురం కూరగాయల మార్కెట్‌కు విక్రయించుందుకు వెళ్తున్నారు. అదే రహదారిలో టెక్కలి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డాడు. కొద్ది సమయం తరువాత స్థానికులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. రత్నాలమ్మ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. లోకనాథంకు ప్రథమ చికిత్స నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి పదో తరగతి చదువుతున్న చిన్నారి, ఏడో తరగతి చదువుతున్న గౌతంలు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

థియేటర్‌లో టిక్కెట్ల దోపిడీ

నరసన్నపేట: మండల కేంద్రంలోని శ్రీదేవి థియేటర్‌లో సినిమా టిక్కెట్ల పేరుతో దోపిడీ చేస్తున్నారని సిపిఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం సినిమా థియేటర్ వద్ద మాట్లాడారు. డబ్బులు ఇస్తే రూ.150, ఫోన్ పే చేస్తే రూ.155 అవుతుందని టికెట్లు ఇచ్చే సిబ్బంది చెబుతున్నారన్నారు. ఎందుకని ప్రశ్నించగా మా థియేటర్ యాజమాన్యం ఇలా చేయమని చెప్పారని, ఫోన్ పే చేయడం వల్ల మాకు డబ్బులు కట్ అవుతుందని చెప్పారన్నారు. ఫోన్ పే అయినా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే టిక్కెట్ విక్రయించా లన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది థియేటర్ యజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

సోంపేట: మండలంలోని కొర్లాంలో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని స్థానిక పెద్దలు రాంబుడ్డి గణపతి, రత్నాల వెంకట రమణమూర్తి, తామాడ వాసుదేవరావు కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎఇ రామారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్దిరోజులుగా గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనివల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్ర మంలో పెద్దింటి సోమేశ్వరరావు, సంగారు ఢిల్లీశ్వర రావు, కళిపిల్లి సుధాకరావు, సంగారు రామస్వామి, రామ్‌బుడ్డి ఉమా, పెద్దింటి పెద్ద మోహనరావు, రాజేష్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

బీమా చెక్కు అందజేత

సోంపేట : మండలంలోని కర్తలిపాలెంకు చెందిన రెల్ల శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడు కొర్లాంకు గ్రామీణ బ్యాంకులో బీమ చేసుకున్నారు. దీంతో ప్రమాద బీమా రూ.పది లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును మృతుడి భార్య సుశీలకు బ్యాంకు అధికారులు బుధవారం చెక్కును అందజేశారు. గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ అనంతరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలపై ఖాతాదారులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల బీమా, ఇతర సదుపాయాలు పొందలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం.రాజారమేష్, నోడల్ ఆఫీసర్ జె.వి.ఎం.గుప్త, సర్పంచ్ గున్నయ్య, మాజీ సర్పంచ్ పాపారావు, ఎస్బిఐ జనరల్ బిడియం వై.రామారావు, ఏరియా మేనేజర్ ఎం.మాధవ్ సాహు, సిఎస్‌పి మీనా, విఒ ఎ.చంద్రవతి పాల్గొన్నారు.

కూరగాయలతో అలంకరణ

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని శాఖాంబరి అమ్మవారి రూపంలో పలు రకాల కూరగాయలతో బుధవారం అలంకరించారు. ఈ రూపంలో ఉన్న కొత్తమ్మతల్లి దర్శనానికి యాత్రికులు తరలివచ్చారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. సమస్యలు తన దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. శ్రీకాకుళం పట్టణం, రూరల్, గారలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను చెప్పవచ్చన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ అజయ్‌కుమార్

ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

యూరియా, డిఎపి, పొటాష్ తదితర రసాయన ఎరువుల వాడకంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని ఎఒ అజయకుమార్ సూచించారు. మండలంలోని కీర్తిపురం, మండపల్లి ఆర్ఎస్‌కే పరిధిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యత, దానిద్వారా నేల ఆరోగ్యం, ఉత్పత్తి, ఖర్చుల తగ్గింపు, అధిక నాణ్యత గల దిగుబడుల సాధ్యత వంటి అంశాలపై వివరించారు. ఇక వరి పొలాల్లో విత్తన దశ నుంచే ధాన్యం మొలకెత్తే దశ వరకు అనుసరించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు వ్యక్తిగతంగా అవసరమైన వ్యవసాయ పనిముట్లు, సాధనాల గురించి విజ్ఞప్తి చేయగా, వాటి ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని అవసరమైన సహకారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఢిల్లీరావు, టొంకరావు, వాసు, హరికృష్ణ, దీక్షిత్, భవాని పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మోహనరావు

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కలివరం రైతు సేవాకేంద్రంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి మెట్ట మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కిలో విత్తనాలకు 8 గ్రాముల సూడోమోనస్ కలిపి విత్తితే అగ్గి తెగులు, ఎండుతెగులు, పాముపొడ తెగులు వంటి అనేక తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. అలాగే విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను కూడా సూడోమోనస్ ఉపయోగించి నివారించవచ్చునని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పంటల ఉత్పత్తిలో ఆరోగ్యకరమైన మార్గాలను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి తమ్మినేని రాము, వ్యవసాయ సహాయకుడు బొడ్డేపల్లి బానోజీరావు, రైతులు పాల్గొన్నారు.

ఎఒ, ఎఎస్ఒను సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయాధికారులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో వ్యవసాయ అధికారులుగా పనిచేసి ఇటీవల ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఎఒ బెండి బాబ్జి, ఎఎస్ఒ శేఖర్‌బాబులకు బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మండలంలో రైతులకు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, డిటి మధుబాబు, ఎడి శ్రీనివాసరావు, ఎఒ ఎం.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎరువులు దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు తమ భవిష్యత్‌ని అంచనా వేసుకునే క్రమంలో చరిత్రపై అవగాహన అవసరమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. సంవిదాన్ హత్యా దివస్ కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1975లో ఎమర్జన్సీ విధింపు, దాని పర్యవసానం ఫలితాలపై వివరించారు. రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఐక్యూ కోఆర్డినేటర్ వి.లూక్‌పాల్, రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి టి.త్రినాథరావు, అధ్యాపకులు రామారావు, కోటేశ్వరరావు, ఎస్.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందరావు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాగోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా మండలం పరిధిలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయ బడునని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నిర్వహణ వలన కొత్తరోడ్డు, తోటాడ, అక్కివరం, వంజంగి, దూసి తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే ఆమదాలవలస సబ్‌స్టేషన్‌లోని 11 కెవి వెంకయ్యపేట ఫీడర్, 11 కెవి అక్కులపేట (పొన్నాంపేట) ఫీడర్ నందు మరమ్మతులు కారణంగా దెబ్బతిన్న స్తంభాలు, తీగలు మార్చడం, చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మున్సిపాలిటీ పరిధిలో తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఎపి టిడ్కో, చంద్ర హర్ష ఆక్వా, కెజిబివి స్కూల్, ఆర్ఆర్ గ్రానైట్, అలాగే రూరల్ పరిధిలో మండాది, మండాది బ్రిక్స్, అక్కులపేట, సంతకోత్తవలస, చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, ధన్నానపేట, మునగవలస, రామచంద్రాపురం, పొన్నాంపేట, గాజులకొల్లివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఇఇ తెలిపారు.

శ్రీకాకుళం సిటీ: ఈనెల 27న శుక్రవారం పిఎన్ కాలనీ సెక్షన్ పరిధిలో 11కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం సరఫరా నిలిపి వేయనున్నట్టు ఇఇ యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. నవభారత్ ఇండస్ట్రియల్, గుజరాతిపేట, హయతీనగర్, పెయ్యలవానిపేట, నవభారత్ నగర్, వరం కాలనీ, కుంచాల కుర్మయ్యపేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాతపట్నం : మండలంలోని గంగువాడ విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణలో భాగంగా ఈ 27న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఇఇ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉప కేంద్రం పరిధిలోని గంగువాడ, తెంబూరు, వెంకటాపురం, పెద్దలక్ష్మీపురం, బడ్డుమర్రి, లాభర, సింగుపురం, రట్టిని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నరసన్నపేట : ఈ నెల 27న మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఉర్లాం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కెవి చోడవరం ఫీడర్‌పై మరమ్మతులు పనులు, కొత్త లైన్ వేస్తున్నామని అన్నారు. నడగాం నుంచి సుందరాపురం వరకు, నడగాం నుండి చోడవరం వరకు, నడగాం నుంచి వెంకటాపురం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



నగరంలోని డాక్టర్ లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఐదేళ్ల బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ట్రామాటిక్ సమస్యతో ఆస్పత్రికిరాగా, ఆపరేషన్ చేశారు. నరాలు సంబంధిత సమస్య లేకుండా కోలుకున్నట్లు వైద్యులు చెప్పారు. స్థిరమైన స్థితిలో డిశార్చి చేసినట్లు డాక్టర్ పైల లక్ష్మీనారాయణ వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

జగన్‌ది రాజకీయ ఉన్మాదం

శ్రీకాకుళం సిటీ: మాజీ సిఎం, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ఉన్మాదిగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, రాష్ట్రకార్యదర్శి పిసిని చంద్రమోహన్ విమర్శించారు. నగరంలో జనసేన నాయకులు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌కు మానవత్వం, జాలి, దయ లేవని విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్నవారు బాధ్యతగా ఉండాలన్నారు. ప్రజల ప్రాణాలకంటే రాజకీయ ప్రయోజనాలు ఎక్కువని విమర్శించారు. కార్యక్రమంలో నాయుకులు కొరికాన రవి కుమార్, డాక్టర్ దానేటి శ్రీధర్, పాత్రుని పాపారావు, కొండా ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి వంశీకృష్ణ

వరి విత్తనాల పంపిణీ

రణస్థలం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు దేరసాం సచివాలయ రైతు సేవా కేంద్రం వ్యవసాయ అసిస్టెంట్ రాహుల్ తెలిపారు. రైతుసేవా కేంద్రం నుంచి రైతులకు సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ ముందస్తు ప్రణాళికతో ఆర్‌బికె కేంద్రాల్లో అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు. బుధవారం దేరసాం ఆర్‌బికెలో రైతులకు రాయితీ విత్తనాలను ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ సమితి సియాలి పంచాయతీ వంకరాడ గ్రామ సమీపంలో అనుమానస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే సియాలి సమీపాన గల వంకరాడ కూడలి నుంచి గాంధీనగర్ వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి శవమై పడిఉన్నాడు. ప్రక్కన ద్విచక్ర వాహనం పడిఉంది. ఐఐసి సునీల్ కుమార్ చెప్పిన సమాచారం ప్రకారం మృతుడు బైక్ పైనుంచి పడి మృతి చెందాడని, ఎవరూ తమకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని, మృతదేహాన్ని బంధువులు తీసుకెళ్లినట్లు తెలిపారు.

శిలగాంలో ఎటిఎం మోడల్ సాగు

ప్రజాశక్తి- కవిటి

ప్రకృతి వ్యవసాయంలో ఎటిఎం మోడల్ సాగు ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని డిఎంఎంటి తులసయ్య, ఎఎంఎంటి నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు కవిటి మండలం శిలగాంకు చెందిన ఎం.సావిత్రికి చెందిన 0.15 సెంట్ల భూమిలో అనంతపురం మోడల్ ఆధారంగా ఎటిఎం పద్ధతిలో సేంద్రీయ సాగు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అందులో భాగంగా నాలుగు అడుగుల వెడల్పు బెడ్లు, అడుగు వెడల్పు నీటి కాలువలు ఏర్పాటు చేసి, మొత్తం 8 బెడ్లు తయారు చేశారు. ప్రతి బెడ్‌లో ఘన జీవామృతం వేసి, బీజామృతంతో శుద్ధి చేసిన 18 రకాల విత్తనాలు నాటారు. వీటిలో ముల్లంగి, గోంగూర, క్యారెట్, తోటకూర, బీట్రూట్, పాలకూర, బెండకాయ, గోరుచిక్కుడు, బీరకాయ, కాకరకాయ, ఆనపకాయ, మొక్కజొన్న వంటి కూరగాయలు ఉన్నాయి. మొక్కలు

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తయారు చేసే ఆహారంలో 40 శాతం ఆకులు, పూలకు, 20 శాతం కాండం, వేర్లకు, మిగిలిన 40 శాతం భూమిలో సూక్ష్మజీవులకు ఆహారంగా మారుతుందని వీరు పేర్కొన్నారు. మోడల్‌ను రైతులు అనుసరిస్తే 365 రోజులు భూమి పచ్చగా ఉండి, కలుషితం లేని పోషకాహార పదార్థాల ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ పవన్, సంతోషి, స్వాతి, జయ రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్న శివప్రసాద్

విద్యతోనే భవిష్యత్

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా నిరంతరం చదువుపై దృష్టి సారిస్తే భవిష్యత్‌లో విద్య దిక్సూచిగా నిలుస్తుందని ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక అధ్యక్షులు బొమ్మాలి శివప్రసాద్ అన్నారు. మండలంలోని బొడ్డపాడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) ఆధ్వర్యాన రంగోయికి చెందిన అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ ముఖ్య ప్రణాళిక అధికారి గేదల రామారావు తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందేందుకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో విద్యార్థుల అభ్యున్నతికి యువివి కృషి చేస్తుందని అన్నారు. మెటీరియల్ అందజేసిన రామారావుకు ప్రధానోపాధ్యాయులు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, బొడ్డు చిన్నారావు, తెప్పల వాసుదేవరావు, కోరాడ లింగమూర్తి, పాలిన కృష్ణారావు, పోతనపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుని నేత్రోత్సవ వేడుకలు

ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి నేత్రోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వంచారు. గత 15 రోజులుగా సుదర్శన, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని యాత్రికులు కనులారా వీక్షించారు. అర్చకులు ఎస్.పద్మకుమార్ ఆచార్యులు, పి.రామతేజ ఆచార్యులు, మూర్తి, ఎస్.రామకృష్ణాచార్యులు ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బెండి రామారావు, సేవకులు కాళ్ల శ్రీనివాస రావు, వల్లంపాటి నారాయణమూర్తి, ప్రకాష్ సాహు, కొదరమ కోటి, చిన్నారి మధు, వెంకటేష్, వల్లంపాటి శ్రీరామ్, పొట్ట వెంకటేష్, ఉల్లిరాజు, వున్న రమేష్, కిల్లంశెట్టి హరికుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ బ్రాహ్మణ వీధి కూడలిలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యాన నేత్రోత్సవం వైభవంగా నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మనిష తెలిపారు. ఇందులో భాగంగా అన్నదానం నిర్వహించామన్నారు.

ఇచ్ఛాపురం : దర్శించుకుంటున్న యాత్రికులు

గ్రామసభలో మాట్లాడుతున్న రామకృష్ణ నాయుడు

'ఉపాధి'పై గ్రామసభ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కె.దీప అధ్యక్షతన మండల గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో 1417 పనులు పూర్తి చేయగా వీటి ద్వారా రూ.26 కోట్ల 69 లక్షల 3 917 ఖర్చు చేసినట్లు జాతీయ గ్రామీణ ఉపాధి సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. అయితే ఉపాధి కూలీలకు 1243 పనులుగాను రూ.18 కోట్ల 48 లక్షల 15.777 ఖర్చు చేశారన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో 143 పనులకు నాలుగు కోట్ల 67 లక్షల పదివేల 602 రూపాయలు, అలాగే రోడ్లు భవనాలు శాఖ ఆధ్వర్యంలో రూ.75 లక్షల 16 వేల 218 ఖర్చు చేశామని, పది పనులకు ఒక కోటి 77 లక్షల 98 547, సర్వశిక్ష అభియాన్ ద్వారా రెండు పనులకు 77 వేల 773 సోషల్ ఆడిట్ ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 19 పంచాయతీల గ్రామసభ నిర్వహించిగా మరో పదకొండు పంచాయతీలు పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, జెడ్‌పిటిసి రామారావు, ఎపిడి శైలజ రాధా, డివిఒ స్వరూప, గౌరీ శంకర్, ఎస్ఆర్‌పి అచ్యుతరావు, ఎంపిడిఒ తిరుపతిరావు, ఎపిఒ రవిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిసిలు పాల్గొన్నారు.

ఇఒ మోహన్‌బాబును సన్మానిస్తున్న అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

అధికారులకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- పొందూరు

16 ఏళ్ల తరువాత నిర్వహించిన పొందూరు పైడితల్లి గ్రామ దేవత పండగను విజయవంతం చేయడంలో అధికారుల కృషి కొనియాడదగినదని మండల టిడిపి అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, పండగ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గ్రామదేవత పండగ విజయంలో కీలక పాత్ర పోషించిన వివిధ శాఖల అధికారులను బుధవారం కమిటీ సభ్యులు, పొందూరు ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ గ్రామ దేవత పండగకు వేలాదిమంది తరలివచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. పండగలో అత్యంత కీలకమైన పారిశుధ్యం, వైద్యం, విద్యుత్ నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేశారని ప్రశంసించారు.

సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ, డిఇ యు.వి. రమణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కామరాజు, ఇఒ మోహన్‌బాబు, వైద్యులు నవీన్, అనూషలను దుశ్శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమవ్వాలి

ప్రజాశక్తి- కవిటి

ప్రతిఒక్కరూ ప్రకృతితో మమేకమవ్వాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పలు పర్యావరణ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా కళాశాల ప్రాంగణాన్ని చదును చేసి, వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పచ్చదనం పెంచడం కోసం ప్రతి విద్యార్థి, అ ద ్యా ప క ు ల ు కంకణబద్ధుడవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మొక్కలను కళాశాల ఆవరణంలో నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాదినాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, బి.అంజన, ఎల్.ఆనంద్ పాల్గొన్నారు.

రణస్థలం : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని హరిత సమగ్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. బుధవారం హరిత సొసైటీ సభ్యులు గొర్లె అప్పల నాయుడు, శిరీష దంపతుల కుమారుడు అఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక పైడిభీమవరం కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో పూలు, నీడనిచ్చే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణారహితమైన మానవ కార్యకలాపాల వలన భూతాపం పెరిగి వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుని ఋతువులు గతి తప్పుతున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రావాడ కృష్ణ, రత్నాకర్, కిరణ్, విజయ్, సంతోష్ కుమార్, శైలజ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ గోవిందరావు

ఉద్యానవన పంటలపై దృష్టి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

తక్కువ ఖర్చుతో రైతులకు ఎక్కువ నికర ఆదాయం ఇచ్చే ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని వాండ్రాడ సచివాలయంలో రైతులకు పంట మార్పిడిపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటలో నికర ఆదాయం తక్కువగా ఉండడంతో పాటు నీటి వినియోగం కూడా ఎక్కువగా ఉంటుందని అన్నారు. అందుకే తక్కువ నీటి వినియోగం, ఎక్కువ నికర ఆదాయం ఇచ్చే మునగ, బొప్పాయి, అరటి, ఆయిల్‌పామ్ వంటి ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. అనంతరం అదే గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వరి పంటలో విత్తనశుద్ధి, కలుపు యాజమాన్యంపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల అప్పలనాయుడు, ఎఇఒ డి.మధుకిరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ పాఠశాలలో 1100 మంది విద్యార్థులు ఉన్నారని, దానికితగ్గ ఉపాధ్యాయులను నియమించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయరామరాజును కోరినట్లు సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయనను కలిసి విద్యార్థుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. అదేవిధంగా డైరెక్టర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ భారత్ నారాయణ గుప్తాను కలిసి ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రాంగాణం వాస్తవిక ఏరియా సర్వే చేయించి చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరినట్లు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పుష్ప

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- పలాస

పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని బ్రాహ్మణతర్లా సర్పంచ్ బాడాన పుష్ప అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లాలో బుధవారం ప్రొక్లెయినర్‌తో పేరుకు పోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం లోపంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలు బారిన పడకుండా ముందస్తుగా పారిశుధ్యం శుభ్రం చేశామని చెప్పారు. వీధి దీపాలు వేశామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సుబాష్, పొందర శ్రీను, సల్ల కామరాజు, కార్యదర్శి శ్రీనివాస్, ఇంజినీర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన బొరివంక, సహలాలపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఆయా పాఠశాలల్లో అభినందన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణిస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణ, వి తారకేశ్వరి, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉన్నత లక్ష్యాలతో ముందుకు...

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలని ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యసాధనకు తల్లితండ్రులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలో 578 మార్కులతో ట్రిపుల్ ఐటి సాధించిన సిస్టు యశ్వంత్, ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన సిస్టు నవదీప్‌ల తల్లితండ్రులు నరేష్, ధనలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

అనారోగ్య ఇతరత్రా కారణాలతో బాధితులుగా మారిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆమె పర్యటించి సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు బాధితులకు సిఎం సహాయనిధి నిధులు మంజూరు చేస్తూ బాధితులకు భరోసాగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పివికె రాజు, టిడిపి నాయకులు బోర గోవిందరావు, ఎస్.మురళీధరరావు, పివివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.